
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
శుక్రవారం 6 డిసెంబరు 2024




దరఖాస్తులకు ఆహ్వానం

బీర్‌పూర్,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికా రి శిరుప నాగభూషణం తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గల కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి సర్టిఫికెట్లతో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అకౌంటెంట్ పోస్టు (1), ఏఎన్ఎం పోస్టు(1), అటెండర్ పోస్టు(1), డే వాచ్ ఉమెన్ పోస్టు(1), నైట్ వాచ్ ఉమెన్ పోస్టు(1), హెడ్ కుక్ పోస్టు(1), అసిస్టెంట్ కుక్ పోస్టు(1) 7వ, తరగతి, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు(1)కు తగిన విద్యార్హతలు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇంకా ఏమైనా సమాచారం కావాలనుకునే వారు బీర్‌పూర్ కస్తూరిబా స్పెషర్ ఆఫీసర్ రజిత సెల్ నెంబరు:8008299004, మండల విద్యాధికారి నాగ భూషణం సెల్ నెంబరు: 9490222042లో సంప్రదించవచ్చన్నారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి

కొడిమ్యాల, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన మందులను తప్పని సరిగా అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి జిల్లా ఉప వైద్యాధికారి ఎన్. శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మండలంలోని తిప్పయ్యపల్లి ఆయు ష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అనంత రం పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఇ. పరమేశ్వరీ, డాక్టర్. నరేష్, సీహెచ్‌వో రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





ఓవర్ డోస్

మోతాదు మించుతున్న మందులు

- అవసరం లేకున్నా యాంటీబయాటిక్స్
- ప్రాణాల మీదకు తెస్తున్న స్టెరాయిడ్స్
- క్రమంగా పడిపోతున్న రోగ నిరోధకశక్తి
- అప్రమత్తత అవసరమంటున్న వైద్యాధికారులు

జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొద్ది మంది ఆర్ఎంపీలు, పీఎంపీలు, కొంతమంది వైద్యులు మోతాదుకు మించి రోగుల కు మందులు ఇస్తున్నారు. దెబ్బకు జ్వరం ఒక్క రోజుకే తగ్గిపోతుంది. తొలి దశలోనే పేషెంట్ కోలుకోవాలన్న ఏకైక లక్ష్యంతో యాంటీబయాటిక్స్‌తో పాటు ఏకంగా స్టెరాయిడ్స్ ఇస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అతిగా మందులు వాడటంతో జిల్లాలో కిడ్నీ సంబంధిత, ఇతర వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

ప్రమాదకరంగా....

చికిత్సపై పూర్తిగా అవగాహన లేని ఆర్ఎంపీలు, పీఎంపీలు అందిస్తున్న వైద్యం ప్రమాదకరంగా ఉందని అధికారులు చెబుతున్నారు. పలు పట్టణాల్లో తనిఖీలు చేసిన సందర్భంలో చాలామంది ఆర్ఎంపీలు, పీఎంపీలు, కొంత మంది వైద్యులు కూడా యాంటీబయాటిక్స్ స్టెరాయిడ్స్ ఎక్కువగా ఇస్తున్నట్లు వెల్లడైందని అంటున్నారు.

కేవలం అనుభవంతోనే...

అర్హత కలిగిన వైద్యులు తమ వద్దకు వచ్చే పేషంట్లకు ఒక క్రమబద్ధమైన కోర్సును ఇచ్చి రోగం నయం చేస్తారు. వారు చదివిన చదువుతో పాటు అనుభవం ప్రస్తుత రోగి పరిస్థితిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకుంటూ వారు చికిత్స కొనసాగిస్తుంటారు. ఏ మందులు ఇస్తే... ఎప్పుడు ఏమవుతుంది. తర్వాత పేషంట్‌పై దీని ప్రభావం ఎలా ఉంటుంది. అనే విషయాలనూ వారు పరిగణలోనికి తీసుకుంటూ వారు చికిత్స కొనసాగిస్తారు. మందులను అదే విధంగా ఇస్తుంటారు. కానీ... కేవలం అనుభవం ఆధారంగా తెలిసిన వైద్యాన్ని ఆర్ఎంపీలు అందిస్తున్నారు. చాలామంది పేషెంట్ పరిస్థితి ఏంటన్న విషయాన్ని ఆలోచించడం లేదని ప్రస్తుత రోగాన్ని నయం చేయడమే చూస్తున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు.

హాస్పిటల్స్ నిర్వహణ..

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీ, పీఎంపీలు ఏకంగా ఆసుపత్రులను నడుపుతున్నట్లు తెలుస్తోంది. కేవలం ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌గా ఉండాల్సిన చోట... ఏకంగా బెడ్లు, మెడికల్, ల్యాబ్‌లతో సహా ఓ పెద్దాసుపత్రిలో ఉండే అన్ని సదుపాయాలు పెట్టి వైద్యం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇదంతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. జిల్లా కేంద్రంలో పలువురు ఆర్ఎంపీలు కలిసి ఏకంగా ఆసుపత్రులు పెట్టడం గమనార్హం. అందులో ఒకదాంట్లో వైద్యులు లేనప్పుడు సదరు ఆర్ఎంపీలే చికిత్స ఇస్తున్నట్లు తెలుస్తోంది.

రోగ నిరోధకతకు దెబ్బ...

త్వరగా అనారోగ్యం, వ్యాధి నయం కావాలన్న తొందరలో అనుభవం అర్హత లేని వైద్యులు, ఆర్ఎంపీలు ఏమేం మందులు ఇస్తున్నారో..కూడా చాలామంది పేషెంట్లకు తెలియడం లేదు. అందులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ కూడా ఉంటున్నాయి. వీటిని తీసుకోవడం వల్ల సంబంధిత రోగం త్వరగానే నయమవుతుంది. కానీ వాటి ప్రభావం దీర్ఘకాలం నష్టాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా మనిషి రోగ నిరోధక శక్తిని తగ్గిస్తాయని వైద్యాధికారులు చెబుతున్నారు. కిడ్నీతోపాటు వివిధ అవయవాలపైనా తీవ్ర ప్రభావం చూపుతాయంటున్నారు. పలు సందర్భాల్లో తనిఖీల్లో చాలామంది అర్హతలేని వాళ్లు ఇలాంటి యాంటీబయాటిక్స్ స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు.

డీఎంహెచ్ఓ స్పెషల్ ఫోకస్..

జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీ ఆగడాలను నియంత్రించడంపై ఇటీవల జిల్లా వైద్యాధికారి ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీలతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. తప్పుడు వైద్యం, అబార్షన్లు, ప్రసవాలు, కొన్ని రకాల సర్జరీలు చేస్తూ కొందరు ఆర్ఎంపీలు ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని మండిపడ్డారు. విచ్చలవిడిగా యాంటి బయోటిక్స్ మందులను రోగులకు

మిగతా 6వ పేజీలో

అన్ని రంగాల్లో యువత ప్రభావం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి వినూత్నరెడ్డి

ఇంటర్వ్యూ

జగిత్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రంగాల్లో యువత ప్రభావం ఉంది.. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి వారధిగా యువజన విభాగాన్ని నడిపించేలా ప్రయత్నిస్తాం. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించిన తాటిపర్తి వినూత్నరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి: యువజన కాంగ్రెస్ ఎన్నికలు ఎలా జరిగాయి.. విజయం సాధించడం పట్ల ఎలా ఫీల్ అవుతున్నారు?

వినూత్న రెడ్డి: ప్రస్తుత యేడాది ఆగస్టు 13వ తేదీ నుంచి సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహిం చారు. ఆన్‌లైన్ పద్ధతిలో



ఎన్నికలు జరగగా, అధిక ఓట్లు సాధించడంతో విజయం కైవసం చేసుకున్నాను. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో ఓపెన్ కేటగిరి మహిళా రిజర్వేషన్‌లో అత్యధిక మెజార్టీతో ప్రథమస్థానం పొంది విజయం సాధించడం సంతోషంగా ఉంది.

ఆంధ్రజ్యోతి: చట్టసభల్లో యువత ప్రాతినిథ్యం ఎలా ఉండాలనుకుంటున్నారు..?

వినూత్న రెడ్డి: ప్రస్తుతం చట్ట సభల్లో యువత ప్రాతినిథ్యం అంతం త మాత్రంగానే ఉంది. కొత్త కొత్త ఆలోచనలతో యువత చట్ట సభల్లో అడుగుపెడితే మరింత అభివృద్ధి సాధించే అవకాశాలుంటాయి. పాతతరం ఆలోచనలకు తోడు కొత్త తరంతో గణనీయమైన అభివృద్ధి సాధించవచ్చు. ఆ దిశగా యువత ముందడుగు వేయాలి.

ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్ మరింత బలపడడంలో యువజన విభాగం పాత్ర ఎలా ఉండబోతోంది..?

వినూత్న రెడ్డి: రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన శక్తిగానే ఉంది. పార్టీని మరింత పటిష్ట పరచడానికి యువశక్తిని భాగస్వామ్యం చేస్తాము. పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలు, ప్రభుత్వం నిర్వహించే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో యువత కీలకంగా ఉండేలా ప్రయత్నాలు చేస్తాం. ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తాము.

ఆంధ్రజ్యోతి: ఎన్నికల్లో విజయం సాధించడానికి కుటుంబ సభ్యులు సహకారం ఎలా అందింది..?

వినూత్న రెడ్డి: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించడానికి కుటుంబ సభ్యులు అందించిన సహకారం ఎంతో ఉంది. ప్రధానంగా పెద్దనాన్న, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రోత్సాహం వల్లే విజయం సాధించాను. మా అమ్మ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి, నాన్న తాటిపర్తి దేవేందర్‌ల ఆశీస్సులు, కృషి అడుగడుగునా అందింది.

ఆంధ్రజ్యోతి: యువతకు మీరు ఇచ్చే సందేశం ఏమిటీ..?

వినూత్న రెడ్డి: యువత అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసర ముంది. యువశక్తి నిర్వీర్యం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. చిన్నచిన్న సమస్యలకు కుంగిపోవద్దు. కృషి, పట్టుదల, నిరంతర శ్రమతో ఏదైనా సాధించవచ్చును. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను. అదే విధంగా నా ఎన్నికకు సహకరించిన ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్తకు పేరు పేరున ధన్యవాదాలు తెలుపుకుంటున్నా.

రూ.32 కోట్లతో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతులు

● పనులు పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్ ● నెల రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నూకపల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లో రూ.32 కోట్లతో చేపట్టిన మౌలిక వసతుల పనులను కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. 4,560 డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లో మురికి కాలువలు, సెప్టిక్ ట్యాంకులు, సీవరేజ్ లైన్, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం కోసం జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి జనవరి మొదటివారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రతి బ్లాక్‌కు లీకేజీలు లేకుండా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయడంతో పాటు అన్ని రకాల మరమ్మతులు డిసెంబరు 15లోపు చేయాలని అన్నారు. 520 గృహాలకు ప్యానెల్ బోర్డులు కూడా పూర్తి చేయాలని అన్నారు. సెప్టిక్ ట్యాంక్‌ల నిర్మాణంలో సీపేజీ నీటిని తొలగిస్తూ బ్యాలన్స్ నీటి ట్యాంక్‌లు పూర్తి చేయాలని పీఆర్ ఈఈని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, ఈఈలు రహమాన్, శేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, మిలింద్, జలంధర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు ఉన్నారు



డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

సంక్షేమ హాస్టల్‌లలో సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని సంక్షేమ హాస్టల్‌లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు గురువారం జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి హాస్టల్‌కు ఒక రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని, శీతాకాలం నేపథ్యంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని, దోమ తెరలు అందించడంతో పాటు, పౌష్టికాహారం అందేలా చూడాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.



జిల్లా అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పది ఫలితాల్లో సత్తా చాటాలి

● జిల్లా విద్యాధికారి రాము



మల్యాలలో కస్తూర్బా విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాము

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటాలని జిల్లా విద్యాధికారి కె. రాము సూచించారు. మల్యాలలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. పది జీపీఏతో అందురూ ప్రతిభ చాటాలని అన్నారు. రివిజన్ పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయలతో పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యతతో ఆహార పదార్థాలు అందించాలని అన్నారు. విద్యార్థుల సమస్యలు వెంట వెంటనే పరిష్కరించాలని అన్నారు. డీఈవో వెంట మండల విద్యాధికారి ఎస్.జయసింహరావు, ప్రత్యేక అధికారి స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జగిత్యాలలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పుప్పాల శ్రీకాంత్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం రాజీలేని పోరాటం నిర్వహిస్తూ కార్మిక, రైతు, కూలీ, మహిళ, విద్యార్థి, యువజన ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సీపీఎం పార్టీ జగిత్యాల జిల్లా మూడవ మహాసభను జయప్రదం చేయాలని అన్నారు. ఉద్యమాలను నేపథ్యం, ఉద్యమ చైతన్యం పోరాడేతత్వం, పుణ్యం పుచ్చుకున్న కోరుట్ల పట్టణ కేంద్రంలో నిర్వహించే ఈ సమావేశానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా అధ్యక్షుడు సురేష్, గర్వందుల రమేష్, చంద్రయ్య, మల్యాల సురేష్, శేఖర్, సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహకారంతోనే జగిత్యాల అభివృద్ధి

● ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతోనే జగిత్యాల నియోజకవర్గం సమగ్ర అభివృద్ధిని సాధిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 43వ వార్డులో రూ.10 లక్షలతో మురికి కాలువపై స్లాబు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హనుమాన్‌వాడ, పోచమ్మవాడ వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, పట్టణంలో రోడ్ల వెడల్పు నిమిత్తం నిర్మాణం చేపట్టామన్నారు. గంజ్ 40 స్లాబ్ నిర్మాణం ఆలస్యం వెనుక స్థానిక ప్రజల సమస్య కొంత ఉందని అధికారులు, మున్సిపల్ చైర్మన్ సమస్యను పరిశీలించాలన్నారు. అంతకుముందు జగిత్యాల మండలంలోని జాబితాపూర్ గ్రామానికి చెందిన కొత్తూరు తిరుపతికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడు వాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, ఏడీసీసీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్ : జగిత్యాల పట్టణానికి చెందిన మతీన్ షరీఫ్ ఊపిరితిత్తుల సమస్యతో నిమ్స్‌లో చూపించడానికి రూ.లక్షా 50 వేల చెక్కును షరీఫ్ కుటుంబసభ్యులకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందజేశారు. యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సాయికుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు. పట్టణానికి చెందిన చక్రం ప్రసాద్ ప్రమాదవశాత్తు గాయపడగా ఎమ్మెల్యే పరామర్శించారు. జిల్లా రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సూర్యం ఉన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

15 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల అర్బన్: జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆస్పత్రి, ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 15 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. అనంతరం 15 మందికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ విజయ్, నాయకులు చెట్‌పెల్లి సుధాకర్, బొడ్డు దామోదర్, శ్రీనివాస రావు, శ్రీరాం భిక్షపతి, మహిపాల్ రెడ్డి, మారుతి, గంగ, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకోవాలి

-డిప్యూటీ రేంజర్ ముషారఫ్

కొడిమ్యాల, డిసెంబరు(ఆంధ్రజ్యోతి) : అడవులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని డిప్యూటీ రేంజర్ ముషారప్ అన్నారు. గురువారం మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలోని ప్రజలకు అడవులను కాపాడుకోవాలని కోరారు. అడవులకు నిప్పు పెట్టడంతో పరాయవరణ కాలుష్యం అవుతుందన్నారు. అడవుల పెరుగుదల వలన కలుగు ప్రయోజనాలను, ఉపయోగాలను ప్రజలకు వివరించారు. అడవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అడవుల పరిరక్షణ మనందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమలో బీట్ అధికారి ఆనందరావు, రామ కిష్టాపూర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఎమర్జెన్సీ పాలన

● బీఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు



సమావేశంలో కొప్పుల ఈశ్వర్, విద్యాసాగర్‌రావు, లోక బాపురెడ్డి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పరిస్థితి ఎమర్జెన్సీని తలపిస్తున్నదని, మాట్లాడితే అరెస్టులు అంటున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు. ఫ్రెండ్లీ పోలీసు విధానం పక్కనబెట్టి నాయకుల అనుమతి లేకుండా అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తోందన్నారు. ప్రశ్నించకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని అన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఫిర్యాదు చేస్తే ఏసీబీ సీఐ ఫిర్యాదు తీసుకోకపోవడం తిరిగి కౌశిక్‌రెడ్డిపై కేసు పెట్టడం హరీష్ రావు, జగదీశ్వర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలపై అక్రమంగా కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, హరిచరణ్ రావు, లోక బాపురెడ్డి, గోస్కుల జలంధర్, మాధవ రావు, వొల్లెం మల్లేశం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పాలనలో గురుకులాలు అస్తవ్యస్తం

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాలు కాంగ్రెస్ పాలనలో దయనీయ స్థితిలో అస్తవ్యస్తంగా మారాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. గురువారం గొల్లపల్లి మండల కేంద్రంలోని పెగడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే సాంఘిక వెనుకబడిన బాలికల విద్యాలయంను సందర్శించేందుకు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి మాజీ మంత్రి రాగా మేయిన్ గేట్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. లోపలికి వెళ్లేందుకు అనుమతులు లేవంటూ గేట్‌కు పాఠశాల సిబ్బంది తాళాలు వేశారు. తమను అడ్డుకోవడాన్ని మాజీ మంత్రి తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను చూడగానే వసతి గృహంలోని విద్యార్థినిలు మెయిన్‌గేట్ వద్దకు వచ్చారు. గురుకులాల పరిస్థితి దయనీయంగా తయారయిందని విద్యార్థులకు మాజీ మంత్రి వివరించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు సరిగా లేకున్నా కలెక్టర్, ఎమ్మెల్యే, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సందర్శనకు వచ్చి అన్ని బాగానే ఉన్నాయని మీ ద్వారా చెప్పిస్తున్నారని మాజీ మంత్రి విద్యార్థులతో పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో గురుకులాలు విజయవంతంగా నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల తలిదండ్రులకు విశ్వాసం సన్నగిల్లిందని అన్నారు.



గొల్లపల్లిలో బాలికల హాస్టల్ గేటు ఎదుట మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత

పాఠశాల, వసతిగృహాల్లో మీకేమైనా ఇబ్బందులు ఉంటే తమతో చెబితే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా విద్యార్థులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు శంకరయ్య, సత్తయ్య, జలేందర్, మారం రాజశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ కాంపెల్లి హన్మాండ్లు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బొల్లం రమేష్, యూత్ అధ్యక్షుడు చెవుల రవీందర్, టీఆర్ఎస్వీ మండల శాఖ అధ్యక్షులు ఆవారి చందు, తదితరులు పాల్గొన్నారు.



సాగు చేస్తున్న నారంభట్ల భరద్వాజ్

సాఫ్ట్‌వేర్ వదిలి సేంద్రియ సాగువైపు..

- ఉద్యోగాలు వదిలి వ్యవసాయం
- సహజ పద్ధతిలో అధిక దిగుబడులు
- వరి, చెరుకు విత్తనోత్పత్తికి ప్రయత్నాలు
- రైతులకు అవగాహన

కోరుట్ల రూరల్/మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్య అభ్యసించారు.. సాఫ్ట్‌వేర్ కొలువులో స్థిరపడ్డారు... అయినా వారికి వృత్తి పరంగా సంతృప్తి అనిపించలేదు. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై ఆసక్తి ఉండటంతో ఉద్యోగాలను వదిలి నూతన పద్ధతిలో సాగు చేయాలని ఇంటి బాట పట్టారు.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన నారంభట్ల భరద్వాజ్, మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన కుంట మధుకుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను వదిలి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. చుట్టు పక్కల రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ నుంచి సాగువైపు వచ్చిన రైతుల గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

వరి, చెరుకు సాగు...

కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన నారంభట్ల భరద్వాజ్ ముంబైలోని ఓ కార్పొరేట్ కంపెనీలో మంచి హోదాతో ఉద్యోగంలో చేరాడు. ఏడాదికి రూ. 6లక్షల ప్యాకేజీతో సుమారు రెండేళ్ల విధులు నిర్వహించాడు. వ్యవసాయంపై మక్కువతో వ్యవసాయం వైపు మళ్లాడు. ఊళ్లో తమకున్న 19ఎకరాల భూమిలో సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ వరి, చెరుకు సాగు చేస్తున్నాడు. విత్తనోత్పత్తి పంటలపై దృష్టి సారించాడు. చెరుకు, వరివిత్త నోత్పత్తిని చేస్తూ రైతులకు విక్రయిస్తున్నాడు. మెదక్, హన్మకొండ, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన వరి, చెరుకు విత్తనాలను భరద్వాజ్‌వద్ద నుంచి కొను గోలుచేసి తీసుకువెళ్తున్నారు. కొన్ని పశువులను పెంచుతూ స్వయంగా సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటూ విని యోగిస్తున్నాడు.

ఎరువుల దుకాణాల్లో లభించే వేస్ట్ డికంపోజర్ అను వంద లీటర్ల లిక్విడ్ బాటిల్‌ను తీసుకొని సుమారు పది కిలోల బెల్లం కలిపి మిశ్రమంగా తయారు చేస్తాడు. వరి, చెరుకు సాగుచేసే వ్యవసాయ క్షేత్రంలో సుమారు పక్షం రోజులు ముందుగా ఈ మిశ్రమాన్ని పిచికారి చేస్తా డు. మిశ్రమం నేలలో మురిగిన తరువాత సాగుకోసం దుక్కులు దున్నుతాడు. విత్త నాలు వేసి సేంద్రియ ఎరువులు విని యోగిస్తూ పంటలు సాగు చేస్తున్నాడు. దాదాపుగా మూడేళ్లుగా సాగు చేస్తున్న ఏ ఒక్క సందర్భంలోనూ భరద్వాజ్ వేసిన పంటకు ఎటువంటి తెగుళ్లు, దోమపోటు, రోగాలు రాకపోవడం విశేషం. సాధారణంగా ఎకరానికి సుమారు 30 నుంచి 34క్వింటాళ్ల వరకు వది దిగుబడి వస్తుండగా అదనంగా నాలుగు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగు బడి సాధిస్తున్నాడు. భరద్వాజ్ అనుసరిస్తున్న నూతన సాగు పద్ధతులు, కొత్త వంగడాల ఆవిష్కరణ వంటి అంశాలను గుర్తించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2017లో ఉత్తమ రైతుగా అవార్డును ప్రకటించింది. హైదరాబాద్ లో మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు.



ఆవులకు మేత వేస్తున్న భరద్వాజ్

సేంద్రియ వ్యవసాయంపై మక్కువతో...

మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన కుంట మధుకుమార్ బీటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఏడాదికి రూ. 16 లక్షల జీతం పొందేవాడు. కరోనా సమయంలో ఇంటికి చేరుకున్నాడు. ఉద్యోగం వదిలి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేశాడు. ఆర్గానిక్ వ్యవసాయం చేసేందుకు నిశ్చయించుకున్నాడు. మొదట నాలుగు ఆవులు, పన్నెండు బర్రెలను కొనుగోలు చేశాడు. పంచగవ్య, జీవామృతం బ్రహ్మాస్త్రం వంటి ఆర్గానిక్ ఎరువులను తయారు చేసి పంటలపై పిచికారి చేశాడు. చీడపీడల నివారణకు వేప కషాయం పిచికారి చేశాడు. నలుగురు కూలీల సాయంతో ఆరు ఎకరాల్లో వరి, మిగితా భూమిలో మొక్కజొన్న, పసుపు, నువ్వు, వేరుశనగ, కూరగాయాలను పండిస్తున్నాడు.



చౌలమద్దిలో ఆర్గానిక్ ఎరువులతో సాగు చేసిన మొక్కజొన్నను చూపుతున్న మధుకుమార్



చౌలమద్దిలోని వ్యవసాయ క్షేత్రంలో పశువులకు ఆహారం అందిస్తున్న మధుకుమార్

సుభాష్ పాలేకర్ శిష్యరికంతో..

నారంభట్ల భరద్వాజ ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ అందిస్తున్న సుభాష్ పాలేకర్ వద్దకు వెళ్లి మెళకువలను సాధించాడు. దీంతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన ద్యాన పండిత్ నెక్కోటి సుబ్బారావును ఆదర్శంగా తీసు కొని నూతన పద్ధతుల ద్వారా సాగు చేస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిపై తెలుసుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ఉపయోగించి అధిక దిగుబడి సాధిస్తున్నాడు.

పంటలను నేరుగా మార్కెట్‌లోకి..

మధుకుమార్ తాను పండించిన పంటలను నేరుగా మార్కెట్‌కు తరలించి విక్రయించేవాడు. అనంతరం మెట్‌పల్లిలో ఒక షాప్ ఏర్పాటు చేసి వినియోగదారులకు సమాచారం అందించాడు. పంట ఉత్పత్తులు ఎప్పటికప్పుడు అమ్ముడు పోయాయి. ఆవు, బర్రె పాలు, పెరుగు, నెయ్యి, నెయ్యితో తయారు చేసిన తిను పదార్థాలతో పాటు పప్పు దినుసులు, పంటలు, తిను బండరాలు విక్రయించడం మొదలు పెట్టాడు. మార్కెట్‌లో మంచి స్పందన రావడంతో ఇతర రైతులు ఆర్గానిక్‌తో పండించిన పంట లను కూడా విక్రయిస్తున్నాడు.

వ్యవసాయమే పండుగలా మార్చాలని



పల్లెల్లో వ్యవసాయమే పండుగలా మార్చే ప్రయత్నంలో భాగంగానే సాగువైపు వచ్చాను. కుటుంబ సభ్యుల సహకారం సంపూర్ణంగా లభిస్తోంది. సాగులో సేంద్రియ విధానాలను వినియోగిస్తున్నాను. పలువురు రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాను. దీనికితోడు విత్తనోత్పత్తి సైతం జరుపుతున్నాను.

-నారంభట్ల భరద్వాజ, రైతు, అయిలాపూర్

రైతుల్లో మార్పు కోసమే...



భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే రైతుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పంటలపై విపరీతంగా రసాయన ఎరువులు పిచికారీ చేయడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. రసాయనాలతో రైతులు అప్పుల పాలవుతున్నారు. దాన్ని చూసి కొంత మంది రైతులనైనా ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకరావాలని నిర్ణయించు కున్నాను. ఉద్యోగం వదిలి ఆర్గానిక్ వ్యవసాయం వైపుకు వచ్చాను.

- కుంట మధుకుమార్, చౌలమద్ది రైతు

ఎస్సారార్ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటానమస్ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ తిరుకోవెల శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అటానమస్ హోదాలో పీజీ మొట్టమొదటి బ్యాచ్ ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ రెండవ సెమిస్టర్‌లో 254 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 198 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పీజీ నాలుగో సెమిస్టర్‌లో 247 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 214 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు టి కరుణాకర్, డాక్టర్ ఎం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న రైల్వే సిబ్బంది

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేశాఖ గుర్తింపుసంఘం ఎన్నికలు గురువారం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో నిర్వహించారు. కరీంనగర్ నుంచి ఆర్మూర్ వరకు ఉన్న రైల్వేస్టేషన్ల పరిధిలోని అన్ని శాఖల్లో మొత్తం 308 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా శాఖలకు చెందిన రైల్వే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 308 ఓట్లకు గాను 250 ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారి యశ్‌పాల్‌సింగ్ తెలిపారు.

రేపు బీసీ కమిషన్ పర్యటన

సిరిసిల్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రానికి శనివారం ప్రత్యేక బీసీ కమిషన్ రానున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల్లో వెనకబాటుతనం, వాటి స్వభావం, ప్రభావం వంటివాటిపై అనుభవ పూర్వకమైన విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నామని, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వారు రాతపూర్వకంగా అభ్యర్థనలను ఇవ్వవచ్చని సూచించారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను యువజన కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ జెండాను విడిచి పెట్టకుండా తన గెలుపు కోసం కష్టపడ్డారని ఆయన తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాస్ బహిరంగ సభలో పాల్గొనేందుకు తరలివచ్చిన ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురి దేవాలయ అభివృద్ధి కోసం రూ 50 కోట్లు, మురికి నీరు గోదావరి నదిలో కలువకుండా డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 17 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ధర్మపురి పట్టణంలో నైట్ కాలేజీని పునఃప్రారంభం చేశామని, చెగ్యాం భూ నిర్వాసితులకు రూ.18 వేల కోట్లు పరిహారం అందించినట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయించి, నిర్మాణం కోసం 25 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని ఆయన తెలిపారు. అంతకు ముందు ఇటీవల ప్రకటించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోద అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు పాల గణేష్, రాందేని మొగిలి, మండల అధ్యక్షు లు అప్పం తిరుపతిని ప్రత్యేకంగా అభినందించారు. వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మారం మండలాల అధ్యక్షులుగా నియమితులైన రమేష్, అంజిత్, గౌతమ్, అనిల్, తిరుపతిలకు ఆయన పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. సమావే శంలో ధర్మపురి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుల వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోద అజయ్‌కుమార్, ధర్మారం ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, మండల యు వజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు

- అసంపూర్తిగా బాలుర వసతి గృహం
- ఏళ్లుగా అద్దెగృహంలో హాస్టల్ నిర్వహణ
- అరకొర వసతులతో విద్యార్థుల ఇబ్బందులు



అసంపూర్తిగా ఉన్న భవనం



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలుర వసతి గృహం

పెగడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహ నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. మండల వ్యవస్థ ఏర్పా టు నుంచి పెగడపల్లి మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాలు అద్దె గృహాలలో నిర్వహిస్తున్నారు. పక్కా భవన నిర్మాణాల గూర్చి దశాబ్దాలుగా పట్టించుకోకపోగా గత ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ నుంచి అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ 2 కోట్లు మంజూరు చేయించారు. నిధులు మంజూరు టెండరు ప్రక్రియ పూర్తి కాగా భవన నిర్మాణ పనులకు గత సంవత్సరమే అప్పుడు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ శంకు స్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్లు వరకు నిర్మించి అర్థాంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా అర్థాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు చేపట్టి అద్దె గృహాలలో అరకొర వసతుల నుంచి విముక్తులను చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి

బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. త్వరలోనే పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయిస్తాం. విద్యార్థులు అవస్థలు పడకుండా చర్యలు తీసుకుంటాం

- దనుంజయ్, ఏఈ

రోడ్డు ప్రమాదంలో రైస్‌మిల్లు ఆపరేటర్ మృతి

సుల్తానాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైస్‌మిల్లు ఆపరేటర్ మృతిచెందాడు. పెద్దపల్లికి చెందిన ప్రసాద్(35) అనే కార్మికుడు సుల్తానాబాద్ ప్రాంతంలోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం మిల్లు వద్ద రాజీవ్ రహదారిని దాటుతుండగా సుల్తానాబద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ అతన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు.

చిన్నారిపై వీధికుక్క దాడి

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రడం రియాన్షి (4) అనే చిన్నారిపై గురువారం వీధికుక్క దాడి చేసి గాయపర్చింది. రియాన్షి ఇంటిముందు ఆడకుంటుండగా వీధికుక్క వచ్చి దాడి చేసింది. కుటుంబసభ్యులు ఇల్లంతకుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మ్యాడంపల్లికి చెందిన ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొట్ల రాయమల్లు(64) భార్య వీరవ్వ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. భార్య ఆరోగ్యంపై బెంగపెట్టుకున్న రాయమల్లు తన భార్యకు ఏమైనా జరిగితే తాను ఒంటరి వాడిని అవుతాననే మనోవేదనకు గురయ్యాడు. తమ ఇంటి ముందు ఉండే మరో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

- అడ్డుకున్న అధికారులు



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చందుర్తి, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట గ్రామ శివారులోని తిరుమల లోది ప్రాంతంలో అక్రమంగా మట్టితరలిస్తుండగా రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. తిరుమల లోది ప్రాంతంలోని సర్వే నంబరు 177లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగా చదును చేస్తూ మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు రెవెనూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాదాపు మూడు ఎకరాల్లో భూమిని చదును చేశారని పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు చదును చేసే పనులను నిలిపివేచారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ విచారణ అనంతరం చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సుమన్ హత్య కేసు నిందితుల అరెస్ట్

- డీఎస్పీ రఘుచందర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపల్లిలో ఈ నెల 2న జరిగిన బొమ్మల సుమన్ (34) హత్య కేసులో నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బొమ్మల సుమన్, బొమ్మల డిల్లేష్‌లు అన్నదమ్ములు. గతంలో బొమ్మల సుమన్ రోజూ మద్యం తాగి వచ్చి బొమ్మల డిల్లేష్‌ని అతని భార్యను, కుటుంబ సభ్యులను తిడుతూ, గొడవ చేస్తూ ఉండేవాడు. బొమ్మల సుమన్ యొక్క తల్లికి ఆమె తండ్రి వారసత్వంగా వచ్చిన సుమారు 36 గుంటల భూమి కుమ్మరిపల్లి హాస్టల్ వద్ద ఉన్నది. అట్టి భూమిని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి సుమారు రూ.11 లక్షలకు అమ్మకానికి పెట్టగా అతడు బయానాగా రూ.2,60,000 అప్పజెప్పాడు. ఆ డబ్బులు మొత్తం డిల్లేష్ ఒక్కడే తనకు అప్పులు ఉన్నాయని చెప్పి తన సొంతానికి వాడుకున్నాడు. ఆ బయనా డబ్బులలో నాకు కూడా వాటా వస్తుందని సుమన్ పలుమార్లు డిల్లేష్ ని అడగగా ఈ విషయంలో వారి మధ్య గొడవలు జరిగాయి. దీనితో తన అన్నను చంపేస్తే ఆ భూమి డబ్బులు తనకే చెందుతాయని ఇక తన అన్నతో ఎలాంటి సమస్య ఉండదని భావించిన డిల్లేష్ తన అన్నను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడు వంజరి సురేందర్ సహాయం కోరగా అతను కూడా హత్య చేయడానికి అంగీకరించాడు. దీనితో ఈ నెల 2న రాత్రి సుమన్‌ను బొమ్మల డిల్లేశ్ అతని స్నేహితుడు పోతానక (వంజరి) సురేందర్ ఇద్దరు కలిసి కత్తితో పొడిచి హత్య చేసి పారిపోయారు. మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి నిందితులు ఇద్దరిని పోలీసులు గురువారం కుమ్మరిపల్లిలో అదుపులోకి తీసుకున్నా రు. నిందితుల నుంచి హత్యకి ఉపయోగించిన కత్తి, వారు పారిపోవడానికి ఉపయో గించిన బైక్, సెల్‌ఫోన్లు వారి బట్టలు స్వాధీనం చేసుకొని నిందితులని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహ రెడ్డి, వెల్గటూర్ ఎస్సై ఉమా సాగర్, బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పటిష్టమైన భద్రత కల్పించాలి

- ఎస్పీ అశోక్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

గొల్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం గొల్లపల్లి మండలం మల్లన్నపేట శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను, భక్తుల క్యూలైన్‌లను, వాహనాల పార్కింగ్ స్థలాలను, రాకపోకలకు సంబంధించిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ రఘుచందర్, ఎస్సై చిర్ర సతీష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండరీ ట్రస్టీ కొండూరి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి పోలీసుస్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంగాధర కేజీబీవీ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో పూర్ణిమ గౌతమి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో నర్సింగ్, సివిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన వారు రెండు రోజుల్లో పాఠశాల పనిదినాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నర్సింగ్ పోస్టుకు ఎమ్మెస్సీ లేదా బీఎస్సీ నర్సింగ్ ఉండాలని, సివిక్స్‌కు ఎంఏ(పొలిటికల్ సైన్స్)తో బీఎడ్ చేసిన వారు అర్హులని తెలిపారు.

రామడుగు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన్‌రావుపేట కేజీబీవీ కళాశాలలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టును తాత్కలికంగా పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో జరిగిన బీఎస్సీ ఆనర్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ యు శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేయడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం సచివాలయంలో ఎస్‌యూ వీసీ ఉమేష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని వీసీ తెలిపారు.

గుర్తింపు దక్కేదెన్నడో..?

విధి నిర్వహణలో హోంగార్డులు పోలీసులకు ఏ మాత్రం తీసిపోరు. ఎండనకా, వాననకా రోడ్లపై పోలీసులతో సమానంగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. చాలీచాలని వేతనాలతో జీవితాలను వెళ్లదీస్తున్నారు. ఏళ్ల తరబడి గుర్తింపునకు నోచుకోవడం లేదు. పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేస్తున్నా హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. **డిసెంబరు 6న హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..**





- పోలీసులతో సమానంగా విధులు
- అరకొర వేతనాలతో ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వం
- నేడు హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నిర్వహించే ట్రాఫిక్, సివిల్ విధులతో పాటు అధికారుల వాహనాలకు డ్రైవర్లుగా, పోలీసు కార్యాలయాల వద్ద విధులను హోంగార్డులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో హోంగార్డులకు డ్రెస్, ఫుడ్, యూనిఫాం అలవెన్స్‌లు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. బెల్ట్, షూస్, సాక్స్, విజిల్‌కార్డు, క్యాప్‌లను 2015 నుంచి ఇవ్వడం లేదు. 2016 నుంచి కారుణ్య నియామకాలను నిలిపివేశారు. పోలీసులకు కల్పిస్తున్న సౌకర్యాలన్నిటిని హోంగార్డులకు కల్పించాలని 2015లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. చనిపోయిన హోంగార్డు కుటుంబానికి 10 లక్షలు నగదుతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. పదవీ విరమణ పొందిన సమయంలో 5 లక్షలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని హోంగార్డులు ప్రభుత్వాన్ని, పోలీసుశాఖను కోరుతున్నారు.

● ఉమ్మడి జిల్లాలో 1,280 మంది హోంగార్డులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,280మంది హోంగార్డులు ఉన్నారు. హోంగార్డులు పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేస్తున్నారు. కొంత మంది అగ్నిమాపకశాఖ, రవాణాశాఖ, కోర్టు, ఆర్టీసీ, ఎఫ్‌సీఐ, ఎండోమెంట్, రైల్వే తదితర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి పోలీసు ఠాణాలో 5నుంచి 10మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ పోషణకు ప్రస్తుత జీతం 27,640 రూపాయలు సరిపోవడం లేదని హోంగార్డులు వాపోతున్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు.

● స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించి..

హోంగార్డు వ్యవస్థ దేశ సరిహద్దుల్లో 1946లో పోలీసులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు స్వచ్ఛంద దళంగా ఆవిర్భవించింది. ఈ విధంగా ఏర్పాటైన హోంగార్డు వ్యవస్థను కాలక్రమేణా పోలీసుశాఖకు అనుబంధంగా కొనసాగిస్తూ 1962-63లో హోంగార్డులకు దినసరి వేతనాలు అందజేశారు. ఆ తరువాత నెలసరి వేతనాలు చెల్లిస్తున్నారు. కానీ నేటి వరకు ఉద్యోగం శాశ్వతం కాకపోవడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు సరిపోవటం లేదని హోంగార్డులు వాపోతున్నారు. కొంతమంది పోలీసు ఉన్నతాధికారులు తమ ఇళ్లలో హోంగార్డులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● పర్మినెంట్ చేయాలని డిమాండ్

హోంగార్డులను పర్మినెంట్ చేసి వేతనాలను పెంచాలని వారు కోరుతున్నారు. పోలీసులకు చెల్లించే భత్యాలు వర్తింపజేయాలని, వారంలో ఒక సెలవు కల్పించాలని, బస్‌పాస్‌లు, ఆరోగ్య కార్డులను అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా హోంగార్డులకు ఒక నెల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు కల్పించాలని కోరుతున్నారు. ఐదు సంవత్సరాల సర్వీసు కలిగిన హోంగార్డులకు కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించి శిక్షణ ఇవ్వాలని విన్నవించుకుంటున్నారు. కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికలో 30 శాతం హోంగార్డులకు రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతున్నారు.

పోలీస్ సెలెక్షన్‌లో రిజర్వేషన్ కల్పించాలి

- ఒక హోంగార్డు

హోంగార్డులకు కానిస్టేబుల్ సెలెక్షన్‌లో రిజర్వేషన్ కోటాను అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. పోలీసులకు కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలు హోంగార్డులకు అమలు చేయాలి.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రితో ఉపాధ్యాయ సంఘాల సమావేశం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు మేరుగు సతీష్ అధ్యక్షతన ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాలకు ముఖ్యఅతిథిగా పర్వతరెడ్డి హాజరై మాట్లాడారు. నూతన ప్రభుత్వ ఏర్పాటు అనంతరం ఒకటవ తారీఖు వేతనం తిరిగి ప్రారంభం అవడం, బదిలీలు పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడంతో మిగతా అన్ని సమస్యలు కూడా ఒక్కొక్కటి పరిష్కారం అవుతాయని ఉపాధ్యాయులు ఎంతో నమ్మకంతో ఇప్పటివరకు ఎదురుచూసారన్నారు. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉండి పరిష్కారానికి నోచుకోకపోవడం వలన ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి అవుతున్నారన్నారు. ప్రధానంగా పెండింగ్ బిల్లులు మంజూరుకాక ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకొని పెట్టిన మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు, పిల్లల పెళ్లిళ్ల కోసం పెట్టిన జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు, డీఏ ఏరియర్స్ బిల్లులు ఏవీ కూడా సకాలంలో మంజూరుకావడం లేదన్నారు. పదేపదే బిల్లులు చేస్తూ సబ్మిట్ చేయడం సంవత్సరం దాటినా వాటికి మోక్షం కలగకపోవడం శోచనీయమన్నారు. రిటైర్మెంట్ అయిన వారికి రిటైర్మెంట్ తేదీ నాటికి అన్ని బిల్లులు చెల్లించాల్సి ఉండగా సంవత్సర కాలం గడిచినా ఎలాంటి చెల్లింపులు చేయలేదన్నారు. దీంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనలకు గురి అవుతూ విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ బిల్లుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకవెళ్తున్నా ఇంకా సమస్య అలాగే ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మందల శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నడిపెల్లి సంతోష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి. మాధవాచారి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి తోట రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరావు, దాసరి శ్రీధర్, సీనియర్ నాయకులు ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఫయాజుద్దీన్, సుంకె నర్సింగమ్, మోతె సమ్మయ్య, గంధం రాజేందర్, కుసుమ దేవేందర్, గుండా మల్లిఖార్జున్, దాతు సదానందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

బంగారు పతకాలు అందుకున్న విద్యార్థి

- ఒడిశా గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన న్యాయవాది ఎలేటి నరేందర్‌రెడ్డి-వందనల కూతురు ఎలేటి వర్షారెడ్డి ఆగ్రికల్చర్ ఎమ్మెస్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందకు రెండు బంగారు పతకాలు అందుకుంది. ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఉన్న వ్యవసాయ సాంకేతిక పరిశోధన సంస్థలో ఎమ్మెస్సీ ఆగ్రికల్చర్ చదివిన వర్షారెడ్డి అత్యున్నత ప్రతిభ కనబర్చి రెండు బంగారు పతకాలను సాధించింది. ఈ సందర్భంగా గురువారం జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ రఘువరన్‌దాసు, ఒడిశా ఉప ముఖ్యమంత్రి వర్ధన్ సింగ్, వైస్ ఛాన్సలర్ ప్రభాత్ కుమార్‌ల చేతుల మీదుగా వర్షారెడ్డి బంగారు పతకాలు అందుకుంది. వర్షారెడ్డిని కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెంచాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అధికారులకు వినతి

భగత్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో జమ్మికుంట రూట్‌లో బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఆధ్వర్యంలో గురువారం వన్ డిపో ట్రాఫిక్ సీఐ హిమబిందుకు వినతిపత్రం అందించారు. వీణవంక, చల్లూరు, పచ్చునూరు గ్రామాల నుంచి నిరుద్యోగులు కరీంనగర్‌లోని ప్రైవేట్ షాపుల్లో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. రాత్రి సమయాల్లో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతి 30నిమిషాలకు ఒక బస్సును నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, వీణవంక మండల కేంద్రంలో ఆర్టీసీ సిబ్బంది పర్యవేక్షణ కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రచన, పరుశురాం, శ్రీకాంత్, సృజన్, సునీల్, తిరుమల, శంరమ్మ, అజయ్, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్తపై దాడి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవలో సర్ది చెప్పేందుకు వెళ్లిన కార్పొరేటర్ భర్త కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డకు చెందిన అక్రం, ఆజాన్, అతిల్ ముగ్గురు సోదరులకు మధ్య గత కొంతకాలంగా కుటుంబ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 3న జరిగిన గొడవలో ఆజాం, అక్రం కలిసి అతిల్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త అయిన అతీనా అతిల్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. తన సోదరుడు అతీల్‌కు మద్దతు ఇస్తున్నాడని కార్పొరేటర్ భర్త అతీనాపై ఆజాం, అక్రం కక్ష పెంచుకున్నారు. ఈ నెల 4న రాత్రి ముగ్గురు సోదరుల మధ్య మరోసారి గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న అతీనా అక్కడకు చేరుకొని ఆజాం, అక్రంలకు సర్ది చెప్పేందుకు యత్నించాడు. దీంతో అతీనాపై కత్తితో దాడి చేశారు. గాయపడ్డ అతీనాను ఆసుపత్రికి తరలిచారు. అతీనా సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఆజాం, అక్రంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సారవంతమైన నేలను అందించాలి

- తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

జమ్మికుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వ్యవసాయ రంగం పరంగా నేల తల్లిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి సారవంతమైన భూమి అందించడం అందరి లక్ష్యంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం ప్రపంచ నేల దినోత్సవం, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, గ్రామ నవ నిర్మాణ సమితి స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని కాపాడుకోవాలని కోరారు. రైతు సంక్షేమ సంఘాలు ప్రకృతి వ్యవసాయంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలు కూడా దీనిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. మానవాళికి ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల్లో నేల ఒకటని చెప్పారు. నేల మనకు కన్నతల్లితో సమానమన్నారు. ప్రస్తుత వ్యవసాయ రంగం పరంగా నేల తల్లిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి సారవంతమైన భూమి అందించడం అందరి లక్ష్యంగా ఉండాలని సూచించారు. ఆ దిశాగా వెళ్లాలంటే రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. హైదరాబాద్ అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిచాలని కోరారు. ఐక్యరాజ్య సమితి సంస్థ ద్వారా యేటా డిసెంబరు 5వ తేదీన నిర్వహించే ప్రపంచ నేల దినోత్సవంలో భాగంగా ఈ ఏడాది మట్టి గణాంకాల సేకరణ, పర్యవేక్షణ, నిర్వహణపై దృష్టి పెట్టాలని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా 731కృషి విజ్ఞా కేంద్రాలు, 3వేల కృషి సఖిల (మహిళల) ద్వారా శిక్షణ ఇచ్చే విధంగా 10వేల జీవ వనరుల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టను తెలంగాణలో మొట్ట మొదటి సారిగా జమ్మికుంట కేవీకేలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యవసాయం, రైతు సంక్షేమ సంఘం సభ్యులు భవానిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తరుపున కూడా రైతు లకు సహాయం అందించాలని, ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కేవీకే ప్రధానకార్యదర్శి విజయ్ గోపాల్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టను జమ్మికుంట, సైదాపూర్ మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో 6,340మంది రైతులతో 10వేల ఎకరాల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి కుమారస్వామి పాల్గొన్నారు.

వర్గీకరణ అమలుకు మాదిగల మహార్యాలీ

మల్లాపూర్, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో గురువారం మల్లాపూర్‌లో వర్గీకరణ అమలు కోరుతూ మహార్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మాదిగ ఉపకులాల సభ్యులు స్థానిక వెంకటేశ్వరాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లినారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లు ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని కోరుతూ తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. రిజర్వేషన్ వర్గీకరణ ఒక్కటే మాదిగలకు న్యాయంను తహసీల్దార్ ద్వారా ప్రభుత్వంకు విన్నవిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏంఆర్‌ఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, ఆయా గ్రామాల మాదిగ కుల సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో ర్యాలీ చేపడుతున్న మాదిగ సంఘం సభ్యులు

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు గురువారం హాజరయ్యారు. కోరెం నుంచి నల్గొండ వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బోయినపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యారం గాన్ని నీరుగార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. చదువుతోపాటు, ప్రైవేటు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ నియోజక వర్గంలో దశల వారీగా ట్రైనింగ్ సెంటర్ లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో చొప్ప దండి నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందన్నారు. బోయినపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ప్రస్తుతం ఉన్న పాఠశాల మొత్తం శిథిలావస్థకు చేరుతోందని, తన దృష్టికి రాగానే స్వయంగా సందర్శించి పాఠశాలను ఉన్న సమస్యలు తెలుసుకున్నానని అన్నారు. కలెక్టర్‌కు సమస్యలు చెప్పగానే నిధులు మంజూరు చేశారన్నారు. పాఠశాల పూర్తిస్థాయిలో రూపు దిద్దుకుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డీఈవో జగన్‌మోహన్ రెడ్డి, సీఈవో వినోద్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఉమ్మడి జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, మండల విద్యాధికారి శ్రావణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం పండితులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండితులు గ్రామస్థులు, భక్తులు ఉత్సవ మూర్తులను గ్రామ చివర నుండి ఊరేగింపుగా యువతీ యువకులు నృత్యాలు చేస్తూ ఆలయానికి తీసుకవచ్చారు. గోవింద నామస్మరణతో అడుగుడుగునా భక్తి శ్రద్ధలతో మంగళహారతులతో స్వామి వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్టీసీ కరీంనగర్ రీజనల్ మేనేజర్ రాజు



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు

భగత్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అన్నారు. కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గురువారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంతో పాటు, తెలంగాణలో కరీంనగర్ రీజియన్ ఎప్పుడూ ఉన్నత స్థానంలోనే నిలిచిందన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియమకాలు త్వరితగతిన జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు కెసత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు విజయమాధురి, మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జి మనోహర్‌రెడ్డి, అసిస్టెంట్‌ట్రాఫిక్ మేనేజర్ సురేష్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆర్‌ఎంను కలిసిన డిపో మేనేజర్లు

రీజియన్ మేనేజర్ రాజును గురువారం డిపో మేనేజర్లు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్లు కెసత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు నాగభూషణం, వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, విజయమాధురి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాలరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన పూటూరి దినేష్‌కుమార్(52) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దినేష్‌కుమార్ జగిత్యాల పట్టణంలో గత 20 సంవత్సరాలుగా లేడీస్‌ఎంపోరియం దుకాణం నడుపుతూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా దుకాణం సక్రమంగా నడవకపోవ డంతో దినేష్ కుమార్ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందిపడుతూ మనోవే దనకు గురవుతున్నాడు. మంగళవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట శివారులో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. దినేష్‌కుమార్ కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

నవ వధువు ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన జక్కుల శ్రీలేఖ (23) అనే నవ వధువు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శ్రీలేఖకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జగద్గిరిగుట్టకు చెందిన పృథ్వీధర్‌రావుతో నవంబరు 7న వివాహం జరిగింది. నవంబరు 27న శ్రీలేఖ తండ్రికి అత్తింటివారు ఫోన్ చేసి జగద్గిరి గుట్టకు రావాలన్నారు. ఆయన అక్కడికి వెళ్లగా శ్రీలేఖను పుట్టింటికి తీసుకువెళ్ళమని చెప్పి పంపించారు. పెళ్లయిన 20 రోజులకే అత్తింటి వారు పుట్టింటికి పంపించి వేయడంతో మనస్థాపం చెందిన శ్రీలేఖ డిసెంబరు 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించిగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. శ్రీలేఖ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ దువ్వాక శివ అన్నారు. ధర్మసమాజ్ పార్టీ రిలే నిరాహార దీక్ష రెండవ రోజు గురువారం ఆయన మాట్లాడుతూ ఉచిత విద్య, వైద్యంతో పాటు ఉపాధి, భూమి, ఇళ్ల ఐదు అంశాలపై రిలే దీక్షలు చేస్తున్నామని ప్రభుత్వం స్పందించకుంటే ఆమరణ దీక్ష చేపడతామని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన బోడుగం జలపతి రెడ్డి గుండెపోటుతో మృతి చెందగా కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి గురువారం పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపి అంత్రక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్, డాక్టర్ తురగ రాజరెడ్డి, నాయకులు బాపురపు నర్సయ్య, ఎద్దండి భూమారెడ్డి,దివాకర్‌రెడ్డి ఉన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

జగిత్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం తల్లి, గొల్లపల్లికి చెందిన నల్ల రాజరెడ్డి ఆస్పత్రిలో వారిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి వారిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

హోటల్‌లో కుళ్లిన సమోస

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి)జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ అవుట్ గేట్ పక్కన గల ఓ హోటల్‌లో కృష్ణ అనే వ్యక్తి సమోసా కొనుగోలు చేయగా అది కుళ్లిపోయి ఉంది. దీంతో అతను హోటల్ యజమానిని ప్రశ్నించగా దురుసుగా సమాధానం చెప్పినట్టు తెలిపాడు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



జగిత్యాలలో మాట్లాడుతున్న శ్రావణి



ధర్మపురిలో మాట్లాడుతున్న కన్నం అంజయ్య

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చనందుకేనా ఈ విజయోత్సవాలు.. అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మంచినీళ్ల బావి వద్ద గ్యారంటీల గారడీ పేరుతో కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో చార్జిషీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రావణి మాట్లాడుతూ ఏడాది కాలం పాటు సాగిన కాంగ్రెస్ పాలన రాష్ట్రాన్ని అప్పుల ఊబి లోకి, అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ఏం చేశారని సంబరాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని మండి పడ్డారు. జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్‌రెడ్డి కళ్యాణలక్ష్మీ పథకంతో పాటు తులం అందిస్తామన్నారని ఎంతమందికి లబ్ధి జరిగిందో చెప్పాలని శ్రావణి డిమాండ్ చేశారు. ప్రతి నియోజక వర్గంలో ఏర్పాటు చేస్తామన్న స్టడీ సర్కిల్ ఎక్కడ ఏర్పాటు చేశారో స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజలకు చెప్పాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

ధర్మపురి: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేపీ ధర్మపురి నియోజక వర్గ ఇన్‌చార్జి కన్నం అంజయ్య ఆరోపించారు. ధర్మపురి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అబద్దాలపై గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు బీజేపీ, బీజేవై ఎం కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము రాంబాబు, నియోజకవర్గ స్థాయి మండలాల అధ్యక్షులు సంగెపు గంగారాం, బెజ్జారపు లవణ్, శ్రీధర్, గంగుల కొమిరెల్లి, కట్ట మహేష్, హనుమంతరావు, జలంధర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో మోసం చేస్తోందని బీజేపీ జిల్లా నాయకులు ఆరోపించారు. గురువారం పట్టణం లోని వేంకటేశ్వర దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ గ్యారెంటీలతో గారడి చేస్తుందన్నారు. కార్యక్ర మంలో వార్డు కౌన్సిలర్ పెండం గణేష్, మ్యాడవేని నరేష్, బీజేపీ నాయకులు వడ్డెపల్లి శ్రీనివాస్, రాచకొండ యాదగిరి బాబు, చెట్లపల్లి సుఖేంధర్ గౌడ్, రుద్ర శ్రీనివాస్, గుంటుక సదాశివ, బింగి వెంకటేష్, రాజేందర్, సుధాకర్, దొనకెల్ల నవీన్, కలాల సాయిచంద్, చింతపల్లి సాగర్, ఇందూరి సత్యం పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ గారడీ అబద్దాలుగా మిగిలిపోయానని, ఏడాది పాలనలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసింది ఏమీ లేదని మెట్‌పల్లి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ విమర్శించారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై పట్టణంలోని కోదాండరామలయం నుంచి కోరుట్ల వరకు బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్ర మంలో అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, బీజేపీ నాయకులు యాదగిరి బాబు, దొనికెల నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, గంగాధర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

- మెట్‌పల్లి సీఐ నిరంజనర్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. పక్కా సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం పట్టణ శివారులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతి లేని ఇసుకను లారీలో నిజామాబాద్ వైపు తరలిస్తుండగా లారీని తనిఖీ చేసి పట్టుకు న్నట్లు తెలిపారు. డ్రైవర్ కృష్ణపై కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నా రు. తప్పనిసరిగా అనుముతులు తీసుకోవాలని తెలిపారు.



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

కోరుట్లలో భారీ వర్షం

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షం కురువడంతో పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సరఫరా పునరుద్ధరించారు. పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఓవర్ డోస్

3వ పేజీ తరువాయి

ఇస్తున్నారని, అటు వంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్‌యాక్ట్ 2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపీలు తమ పేర్ల ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని ఆదేశించారు. చికిత్స కేంద్రం ముందు సూచిక బోర్డులపై ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ప్రదర్శించాలని సూచించారు. క్లినిక్, ఆసుపత్రి, నర్సింగ్ హోం, మెడికల్ సెంటర్ తదితర పేర్లతో సూచిక బోర్డులు ప్రదర్శించరాదన్నారు. ఆర్ఎంపీలు స్వయంగా రోగ నిర్ధారణ చేసి మందులు ఇవ్వడం, ఇంజక్షన్లు చేయడం వంటివి చేయరాద న్నారు. రోగులకు వైద్య మందుల చీటీని రాయ కూడదని, రోగులకు సెలైన్ బాటిల్స్ ఎక్కించారదని వివరించారు. ఇన్ పేషంట్ వైద్యం చేయకూడదని, ల్యాబ్‌లు నిర్వహించరాదని, అబార్షన్లు, కాన్పులు వంటి హై రిస్క్ చికిత్సలు చేయవద్దని హెచ్చరించారు. జిల్లాలో చాలా మంది నకిలీ డాక్టర్లు మానసిక ఔషదాల ప్రిస్కి ప్షన్ల లోనూ ఇష్టారాజ్యంగా మందులు రాస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని హెచ్చరించారు. ఇప్పటికైనా అర్హత లేకున్నా వైద్యం చేయడం, మోతాదుకు మించి మందులు ఇవ్వడం తగ్గాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మణ్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబర్5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన దినోత్సవాలలో భాగంగా జగిత్యాల ఆర్టీసి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామన్నారు. కార్మికుల సంక్షేమం, ఆర్టీసి పరిరక్షణ, కోసం ప్రయాకుల పరిరక్షణ కోసం పాటుపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్టీసి డిపో మేనేజర్ సునీత, మెట్‌పెల్లి, కోరుట్ల డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకులకు సన్మానం

జగిత్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన వారిని గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు. యువజన కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పని చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో యూత్ కాంగ్రెస్ ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు.



విరాళం అందిస్తున్న అయ్యప్ప స్వాములు

దేవాలయ అభివృద్ధికి విరాళాలు

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయ అభివృద్ధి, ఉత్సవాల నిర్వహనకు అయ్యప్ప స్వాములు, దాతలు విరాళాలను అందించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు విరాళాలను అందించారు. దేవాలయ పహరీ నిర్మాణ దాతలు అడెపు శంకర్ - భారతి దంపతులు రూ.51,116, గట్ల ఆనంద్ - బాగ్యలక్ష్మి దంపతులు రూ. 21,116, ఇట్యాల శంకర్ - విజయలక్ష్మి రూ. 11,116, వనపర్తి చంద్రమోహన్ - రమ్య దంపతులు రూ. 10,116 అందించారు. సుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకు జరిగే వేడుకలతో అన్నదానం కొరకు రూ. 25,116 నగదును దేవాలయ కమిటీ సభ్యులకు అందించారు. దేవాలయ అభివృద్ధికి సహకారం అందించిన దాతలను, అయ్యప్పస్వాములు వేదపండితుడు పాలెపు రాంశర్మ పూజలు చేసి ఆశీర్వదించారు.

పెగడపల్లిలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్

పెగడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మైదానంలో గురువారం నెహ్రూ యువ కేంద్రం, శాతవాహన యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. పోటీలలో కబడ్డీ జస్వంత్ టీం పెగడపల్లి ప్రథమ, రాహుల్ టీం నామాపూర్ ద్వితీయ బహుమతులు గెలుచుకోగా, వాలీబాల్ వంశీ టీం పెగడపల్లి ప్రథమ బహుమతి, కబడ్డీలో శ్రీజ టీం దోమలకుంట ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు.

ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.భూమేష్, కళాశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, వాలంటరీ మారం గణేష్, పీఈడి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజేష్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బీరం రాజేష్, నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నల్ల స్వామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా తాటిపర్తి పరీక్షిత్‌రెడ్డిలు ఘన విజయం సాధించారు. విజేతలను కాంగ్రెస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, తాటిపర్తి రామ చంద్రారెడ్డి, బాలకృష్ణారెడ్డి, చందా కృపాకర్‌రెడ్డి, చిట్ల అంజన్న అభినందించారు.

రాయికల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జలంధర్ రెడ్డి

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏలేటి జలంధర్ రెడ్డి 526 ఓట్లతో గెలుపొందాడు. సెప్టెంబరులో జరిగిన ఎన్నికల ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదల కాగా, రాయికల్ మండల అధ్యక్షుడిగా ఏలేటి జలంధర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ మసూద్, జక్కుల సాగర్, గుమ్మడి సంతోష్, మండల జనరల్ సెక్రెటరీగా మహేష్, సుధార్, ప్రవళిక, జిల్లా వైస్ ప్రెసిండెంట్‌గా రాకేష్ నాయక్, జిల్లా జనరల్ సెక్రెటరీగా షాకీర్, బొడ్డు గంగాధర్, అసెంబ్లీ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా బాపుర రాజీవ్, అసెంబ్లీ జనరల్ సెక్రెటరీగా బోదాసు జలపతి ఎన్నికయ్యారు.

బుగ్గారం కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా అంజిత్ కుమార్

బుగ్గారం డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా సీగిరి రంజిత్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద యువకులు స్వీట్లు పంచుతూ, టపాసులు పేల్చి సంబరాలు చేశారు.

కొడిమ్యాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజయ్‌గౌడ్

కొడిమ్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన గాజుల అజయ్‌గౌడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా మూడవసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అజయ్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

పెగడపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పురుషోత్తం గౌడ్

పెగడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పురుషోత్తం అనీల్‌గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కొండం మధుసూదన్ రెడ్డి ఎన్నికైనట్లు పార్టీ మండల అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వెల్గటూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రమేష్

వెల్గటూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వెల్గటూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పూదరి రమేష్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కోరుట్ల యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శిగా గంగాధర్

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శిగా కోరుట్ల పట్టణానికి చెందిన కడకుంట్ల గంగాధర్ ఎంపికయినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి ఆజాద్, విజయ్ ఆజాద్‌లకు గంగాధర్ ధన్యావాదాలు తెలిపారు.

● కోరుట్ల రూరల్ : యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోరుట్ల పట్టణానికి చెందిన కటకం చంద్రశేఖర్ ఎంపికయ్యాడు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునిగా ముత్యం శంకర్

మల్యాల, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా కొండగట్టుకు చెందిన ముత్యం శంకర్‌గౌడ్ ఎన్నికయ్యారు. శంకర్‌ను, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శనిగరం తిరుపతి, ఉపాధ్యక్షుడిగా నాగులపేట సంజీవ్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేలను కాపాడుకోవాలి..



బీర్‌పూర్‌లో మట్టి నమూనాలను సేకరిస్తున్న అధికారులు

బీర్‌పూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని రైతు వేదిక భవనంలో గురువారం ప్రపంచ మృత్తికా (నేల)దినోత్సవాలను మండల వ్యవసాయ అధికారి రాజుకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు నేలను సంరక్షించుకోవాలని, నేలను రసాయనా లతో కలుషితం చేయకుండా సేంద్రియ ఎరువులను వాడాలని, కొయ్య కాళ్లు తగలబెట్టకుండా కలియదున్నాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షలు ఏవిధంగా చేసుకోవాలో క్షేత్రస్థాయిలో మట్టి నమూనాలు తీసే పద్ధతి విధానాన్ని ఏవో, ఏఈవోలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వినోద్, శిరీష, బీర్‌పూర్ సహకార సంఘం వైస్ చైర్మన్ ఊరడి కొమురెల్లి, ధర్మపురి ఏ.ఎం.సీ డైరెక్టర్ ఏనుగు జోగిరెడ్డి, మండలంలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నేలల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు

రాయికల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రైతులకు నేలల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం దత్తత గ్రామ మైన అల్లీపూర్‌లో రైతులకు నేలల ప్రాముఖ్యత, భూసార పరిరక్షణ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రజనీకాంత్, రవి, సాయినాథ్, రజనీ దేవి, ఏఈవో సుమలత, రైతులు, గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటే అది మానవ జాతి ఆరోగ్యాన్ని కాపాడుతుందని చెప్పారు. భూమికి కర్బన పదార్థాలను అందించే వరి కొయ్యకాలను కాల్చి మొత్తం జీవరాశిని ప్రమా దంలో నెట్టకుండా జాగ్రత్తపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నరేందర్, మాజీ సర్పంచ్ అరుణరఘు, మాజీ ఉప సర్పంచ్ బసవరాజుల రాజు, కార్యదర్శి లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సహజ వనరులలో నేల అతి ముఖ్యం

కోరుట్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): సహజ వనరులలో నేల అతి ముఖ్యమని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. గురు వారం మండలంలోని అయిలాపూర్, మోహన్‌రావుపేట, సంగెం, పైడిమడుగు లోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ లు నరేష్, షమీనా, శ్రీహరి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మల్లాపూర్, (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల్లో నేల అతి ముఖ్యమైందని మల్లాపూర్ లావణ్య అన్నారు. గురువారం ప్రపంచ మృతిక దినోత్సవం సందర్భంగా నేల ఆరోగ్యం, సేంద్రియ కర్బ ణం పెంచడంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయం, నేల సంరక్షణ, పచ్చి రొట్టె ఎరువులు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

మెట్‌పల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో ప్రపంచ మృతిక(నేల) దినోత్సవాన్ని వ్యవసాయాధికారులు ఘనంగా నిర్వహించారు. గురువారం చౌలమద్ది, బండలింగాపూర్ వెల్లుల్ల, మెట్లచిట్టాపూర్, జగ్గసాగర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో మండల వ్యవసాధికారి దీపికతో పాటు ఏఈవోలు నేల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పొలంలోని మట్టి సారవంతాన్ని పరీక్షలు చేయించి పంటలు సాగు చేసుకోవాలన్నారు. నేల యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు దీపిక, నరేష్, మనోజ్ఞ, మమత, భూమేశ్వర్, రాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



భీమారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో నరేందర్

డ్రగ్స్ నివారణపై అవగాహన

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో గురువారం జాతీయ సేవా పథకం, యాంటీ డ్రగ్స్ కమిటీ విభాగం ఆధ్వర్యంలో కాలేజ్ ప్రిన్సిపల్ ఆర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా టిఎస్ న్యాబ్ వారు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినయోగం పెరుగుతుందని వీటి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టలను వివరించారు. డ్రగ్స్ వల్ల యువత జీవితం నాశనం అవుతుందన్నారు. అనంతరం అధ్యాపక బృందం, విద్యార్థులు మాధకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి గోవిందులు వెంకటేష్, అధ్యాపకులు శ్రీనివాస్, జగపతి, నర్సయ్య, మంజుల పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అరవైఆరు మోసాలతో ప్రజలను వంచిస్తుందంటూ బీజేపీ నాయకులు మల్యాలలో నిరసన తెలిపారు. బ్లాక్ చౌరస్తా వద్ద గల అంబెద్కర్ విగ్రహంకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బింగి వేణు, బొట్ల ప్రసాద్, గాజుల మల్లేశం, జనగాం రాములు, గుండేటి గంగారాం, మల్లేశం యాదవ్, రుత్త కిషన్, గోవర్ధన్‌రెడ్డి, పన్నాటి మల్లేశం, గౌతం తదితరులు ఉన్నారు.

కొండగట్టులో ప్రజా విజయోత్సవాలు

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజావిజయోత్సవాలలో భాగంగా కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో గురువారం స్వామి వారికి అర్చకులు, వేదపండితులు, ఆగమ పాఠశాల విద్యార్థులు సహస్రనామార్చన, అభిషేకం, వేదపారాయణం చేశారు. అనంతరం సామూహిక భజన, ప్రసాద వితరణ చేశారు. పర్యవేక్షకులు హరిహరనాథ్ పాల్గొన్నారు

'ఎమ్మెల్యే సంజయ్‌ని విమర్శించే స్థాయి లేదు'

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావుకు లేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు బెదిరింపు రాజకీయలు చేస్తున్నారని విమర్శించారు. కనీసం వార్డు మెంబర్‌గా ఎన్నిక కాని మీరు బెదిరిస్తే ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చేదాకా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బంగారుకాళ్ల కిషోర్, అంగడి పురుషోత్తం, నాని, సంగం సాగర్, రమేష్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

మల్లాపూర్, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని మెట్‌పల్లి డీఎస్పీ రాములు హెచ్చరించారు. గురువారం మండలంలోని చిట్టిపూర్ అట్రాసిటీ కేసుపై మల్లాపూర్ ఎస్సై కిరణ్‌తో కలిసి విచారణ చేపట్టారు. కులం పేరుతో దూషించిన ఘటనలో అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి విచారణలో గ్రామంలోని సాక్షుల నుంచి వివరాలను సేకరించినట్లు తెలిపారు. మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భవిత కేంద్రంలో ఘనంగా వికలాంగుల దినోత్సవం

కొడిమ్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వికలాంగుల ప్రత్యేక అవసరాలపై అవగాహన కలిపించారు. సమగ్ర శిక్షణ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా వికలాంగులకు స్వీట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాళ్ళు విజయేంద్ర, పద్మ, ప్రత్యేక ఉపాధ్యాయులు సురేష్, లక్ష్మీరాజం, ఫిజీయో థెరఫీ డాక్టర్ ప్రశాంత్, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.